క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



గంగారంలో పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న భిక్షపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పలు గ్రామాలలోని పోలింగ్ స్టేషన్‌లలో వసతుల ఏర్పాట్లను పరిశీలించామని రూట్ అధికారి భిక్షపతి తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని అజ్జమర్రి, గంగారం గ్రామాలలో పోలింగ్‌స్టేషన్‌లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈవీఎంలు పంపిణీ చేసేందుకు సరైన రూట్ ఎంపిక చేసుకున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శంకర్

అల్లాదుర్గం(మెదక్): ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్ చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గంలో వంద శాతం ఓటింగ్ జరగాలని కళాజాత ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే వజ్రాయుధం అన్నారు. ఓటు దుర్వినియోగం చేస్తే ప్రజాస్వామ్యానికి విలువ ఉండదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి, ఏపీఎం నాగరాజు, టీచర్లు, కళాకారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు



ముట్రాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లితో పాటు, పలు గ్రామాలలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం వైద్య సిబ్బంది, గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రక్తహీనత నివారించేందుకు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లతో పాటు, రాగులు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం

చేగుంట(తూప్రాన్): మండల స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌చారి, ఉపాధ్యక్షుడుగా తిరులచారి, సహాయకార్యదర్శిగా శ్రీధర్‌చారి, కోశాధికారిగా శంకరాచారి, కార్యవర్గసభ్యులుగా విష్ణు, రమేశ్, భాస్కర్, వెంకట్‌చారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల స్వర్ణకారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కృష్ణగౌడ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్న చింతకుంటలో జరిగింది. శుక్రవారం నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర కృష్ణగౌడ్(38) వ్యవసాయం కోసం పెట్టుబడి, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పుల భారంతో కొన్ని రోజులుగా మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తన పొలంలోని ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య లావణ్య, పిల్లలు డింపుల్, వరుణ్ తేజ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుంత.. ఆదమరిస్తే చింత

మండలంలోని చెర్లపల్లి పంచాయతీ పరిధి వర్దవాని చెరువు తండా సమీపంలోని ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. వర్షాలకు బీటీ రోడ్డు పక్కన ఉన్న మట్టి కోతకు గురైంది. దీంతో రోడ్డు పక్క పెద్ద కయ్యలా ఏర్పడింది. అలాగే రోడ్డు పక్కన చిన్నచిన్న చెట్లు పెరగడంతో వాహనదారులకు గుంత కనిపించడంలేదు. అనుకోకుండా ఎవరైనా రోడ్డు కిందకు దిగితే ప్రమాదం జరుగుతుంది. అధికారులు స్పందించి గుంతలను వెంటనే పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన గుంత

ఖేడ్‌లో ఎగరేది బీజేపీ జెండానే

- బీజేపీ అభ్యర్థి సంగప్ప

పెద్దశంకరంపేట(మెదక్): ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణఖేడ్‌లో ఎగరేది బీజేపీ జెండానే అని నారాయణఖేడ్ బీజేపీ అభ్యర్థి జనవాడ సంగప్ప అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన బూత్‌లెవల్, మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని, ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపుకోసం కష్టపడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం



సమావేశంలో మాట్లాడుతున్న సంగప్ప

విఠల్, నియోజకవర్గ నాయకులు పత్రి రామకృష్ణ, పట్నం మాణిక్యం, సర్పంచ్ సుధాకర్, నాయకులు సాయిలు, శ్రావణ్, కృష్ణ, బాబు, సురేశ్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శోభ

కొల్చారం(నర్సాపూర్): దీపావళికి రెండు రోజుల ముందే గ్రామాల్లో పండగ శోభ సంతరించుకుంది. శుక్రవారం ధన త్రయోదశిని పురస్కరించుకొని ప్రజలు గృహాల్లో ధన్వంతరి, లక్ష్మీదేవి, కుబేరులకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. శుక్రవారం లక్ష్మీదేవిని పూజిస్తే శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. ఈ సందర్భంగా ఇళ్లను దీప కాంతులతో నింపారు.

బీఆర్ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం

నిజాంపేట(మెదక్): ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన, చేయబోతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటెయ్యాలని, పద్మా దేవేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీఆర్ఎస్ నాయకులు గడప గడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిజాంపేట మండలంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, రామాయంపేట ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్, యాదగిరి, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాజా చంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్కల్ గ్రామంలో గ్రామస్తులు పద్మాదేవేందర్‌రెడ్డికి మద్దతుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సులోచన వెంకటస్వామిగౌడ్, మాధవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, లక్ష్మణ్, కొండస్వామి, మల్లేశ్, నాగేందర్ బీఆర్ఎస్‌లో చేరారు.కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, జిల్లా నాయకులు రాజిరెడ్డి, నారాయణరెడ్డితో పాటు పలు గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంతోష్ కుమార్

- ఎన్నికల పరిశీలకుడు సంతోష్ కుమార్
- కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట తక్షణమే పనులు పూర్తి చేయించాలని ఎన్నికల పరిశీలకుడు, డీఐజీ సంతోష్ కుమార్ తుకారాం అధికారులను ఆదేశించారు. ఈ నెల 30న జరుగబోయే ఎన్నికల నిర్వహణలో భాగంగా మెదక్ బాయ్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంమ్, అలాగే వైపీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆయన జిల్లా ఎస్పీ పి.రోహిణి ప్రియదర్శినితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేం స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలపై తీసుకుంటున్న చర్యలను ఎస్పీ ఆయనకు వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి, ఆయా గదుల్లో చేపడుతున్న అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, సీఐలు వెంకట్, రాజశేఖర్ రెడ్డి, హవేళి ఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



తేమశాతం పరిశీలిస్తున్న కృష్ణయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణయ్య కోరారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని శీలాంపల్లి, సామ్లా తండాలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యంలో తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఓలు వెంకటేశ్, సురేశ్, ఏఈఓ భూపాల్, సీసీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ డీఆర్‌డీఓ భీమయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, రెండో రకానికి రూ.2183ను కేటాయించిందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీపీఎం మోహన్, పీఎం రామకృష్ణ, సీసీ శ్రీనివాస్, ఎఈఓ లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వీఓఏలు వినోద, ప్రమోద్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సావిత్రి, నాగరాణి, రైతులు సంగమేశ్వర్‌రెడ్డి, నాగప్ప, పీరయ్య, సంజీవరెడ్డి ఉన్నారు.

పద్మక్క గెలుపు.. మల్లన్నకు ముడుపు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపు కోసం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ కొమురవెల్లి మల్లన్నకు ముడుపు కట్టారు. శుక్రవారం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని గంగారేణు చెట్టు వద్ద పద్మక్క గెలుపు కోసం ముడుపు కట్టారు. కార్యక్రమంలో శాలిపేట సర్పంచ్ సాయం పోచయ్య, బీఆర్ఎస్ నాయకుడు గొండస్వామి ఉన్నారు.



మల్లన్నకు ముడుపు కడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ హ్యాట్రిక్ సాధించాలని పూజలు



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలని కోరుతూ తూప్రాన్ మండల బీఆర్ఎస్ నాయకులు ఏడుపాయల దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూప్రాన్ నాచారం దేవస్థానం డైరెక్టర్ పల్లేమిది చంద్రారెడ్డి, మండల మైనారిటీ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, 12వ వార్డు అధ్యక్షుడు గంగాధర్ వెంకటేశ్, బలరాం రెడ్డి, తాటి విశ్వం, కుమ్మరి రమేశ్ పూజల్లో పాల్గొన్నారు.

రూ.2 లక్షలు చోరీ

- టార్పాలిన్ వ్యాపారి దుకాణంలో అపహరణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

హవేళిఘణాపూర్(మెదక్): షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.2లక్షలు చోరీచేసిన ఘటన మండల పరిధిలోని మంభోజిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ అమర్ కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన గోపాల్‌తో పాటు మరో 8 మంది టార్పాలిన్ల వ్యాపారం చేస్తుంటారు. అలా వచ్చిన రూ.2లక్షల నగదును షాపులో ఉంచి ఉదయం వారి వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నామని రూరల్ సీఐ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.



డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

సుగంధ ద్రవ్యాలపై అవగాహన

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని అనంతసాగర్ రైతువేదిక వద్ద పసుపు, మిర్చితో పాటు ఇతర సుగంధ ద్రవ్యాలపై వ్యవసాయశాఖ, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఉన్నతికి చేపట్టిన పలు కార్యక్రమాలు, సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ లింకేజ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, సహకార వ్యవస్థ గురించి రైతులకు వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు ప్రకాశంకు చెందిన పసుపు, తమలపాకు పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో క్లస్టర్ హార్టికల్చర్-సెరికల్చర్ అధికారిణి శైలజ, సదాశివపేట్ జీవ నియంత్రణ వ్యవసాయ అధికారిణి ప్రేమలతరెడ్డి, ఏఈఓ మనోహర్, స్పైసెస్ బోర్డ్ ఇండియా డివిజనల్ ఆఫీస్ ఇన్‌చార్జి శివకుమార్, రైతు ప్రతినిధులు జైపాల్, మాణిక్‌రెడ్డి, రాములు, లక్ష్మణ్‌గౌడ్, ప్రవీణ్, దేవదాస్, వహీద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంటలోని యూటర్న్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళను నల్లగండ్ల వైపు నుంచి లింగంపల్లి వైపు వస్తున్న రెడీమిక్స్ లారీ వేగంగా వచ్చి మహిళను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి వివరాలు లభించలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): దాతల సహకారంతో దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వీరభద్రస్వామి దేవాలయ ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్మించిన సంతను ప్రారంభించపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

న్యాల్‌కల్(జహీరాబాద్): మద్యం మైకంలో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని శంశల్లాపూర్ గ్రామశివారులో చోటుచేసుకొంది. హద్నూర్ ఎస్ఐ రామానాయకుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రభు(35)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి నుంచి వెళ్లిన ప్రభు మద్యం మత్తులో శంశల్లాపూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా మాక్ పోలింగ్

- నామినేషన్లతో విద్యార్థుల సందడి
- రిటర్నింగ్ అధికారి శ్రీదేవికి పత్రాల అందజేత



చిన్నశంకరంపేట(మెదక్): రిటర్నింగ్ అధికారి శ్రీదేవికి నామినేషన్ పత్రం అందజేస్తున్న విద్యార్థిని

చిన్నశంకరంపేట(మెదక్): బాజా, భజంత్రీలు టపాసుల చప్పుళ్లు మరోవైపు భారీ జన సందోహం.. నినాదాలతో నామినేషన్లు వేసేందుకు తరలివచ్చిన అభ్యర్థులు.. అచ్చం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను తలపించేలా అట్టహాసంగా నామినేషన్ల పర్వం ముగిసింది. ఇదంతా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో మోడల్ స్కూల్ అండ్ కాలేజీ విద్యార్థులు మాక్ పోలింగ్ కోసం చేసిన హడావుడి. శుక్రవారం స్కూల్‌లో నిర్వహించే మాక్‌పోలింగ్‌లో పాల్గొనేందుకు 8 మంది అభ్యర్థులు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి శ్రీదేవికి అందజేశారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు మహేశ్, సాయిప్రసాద్, విక్రంపుర్‌ఖాన్, ఆకాశ్, శ్రీజ, ప్రమీల, అను, శ్రీనిధి నామినేష్ల దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా, ఈ నెల 16న ఎన్నిక జరగనుందని రిటర్నింగ్ అధికారి శ్రీదేవి తెలిపారు.

ఓటింగ్‌లో 542 మంది విద్యార్థులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ తెలంగాణ మోడల్ స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి మాక్ పోలింగ్ నిర్వహించారు. రామలీల, తనుజశ్రీ,, ప్రియా శ్రీ,, కృష్ణ వర్ధన్, ఎండీ హుస్సేన్, ఎండీషఫీ ఉద్దీన్‌లు పోటీలో ఉండగా వారికి గుర్తులు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రొసీడింగ్, పోలింగ్ అధికారులుగా, మరికొందరు విద్యార్థులు ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరించారు. 542 మంది విద్యార్థులు ఓటింగ్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురకంటి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, నాగేంద్ర, లీల, కృష్ణవేణి, మహేశ్వరి, లావణ్య, విఠలేశ్వర్, అన్వేష్ పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయనిర్మల, సోషల్ ఉపాధ్యక్షుడు శంషొద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మాక్‌పోలింగ్ కోసం ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **108 వాహనం తనిఖీ**



రామాయంపేట(మెదక్): 108 అంబులెన్సును ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా ఈఎంఈ మహేశ్ కుమార్ తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న పరికరాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ట్యాబ్, డిజిటల్ విధానం వినియోగంపై అవగాహన కల్పించారు. సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కౌడిపల్లిలో డ్రైడే**

కౌడిపల్లి(నర్సాపూర్: కౌడిపల్లితో పాటు, పలు గ్రామాలలో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి డ్రమ్ములు, ఇతర పాత్రలు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, పనికిరాని వస్తువులలో నిలచిన నీటిని తొలగించారు. నీరు నిల్వ ఉంటే దోమలు విజృంభిస్తాయని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేస్తున్న నర్సారెడ్డి కార్యక్రమానికి మనోహరాబాద్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కాళ్ళకల్ బంగారమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళ్ళకల్ నుండి బైక్ ర్యాలీగా గజ్వేల్‌కు తరలివెళ్లారు.

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.సంజీవరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పెద్దశంకరంపేట మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పలు వాహనాల్లో తరలివెళ్లారు. వివిధ గ్రామాలుల నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



రామాయంపేట(మెదక్): ఒక కూతురు తన తండ్రికి తలకొరివి పెట్టిన ఘటన గ్రామంలో సంచలనంగా మారింది. పట్టణంలోని కేసీఆర్ కాలనీకి చెందిన జెట్టి శ్రీనివాస్ శుక్రవారం మృతి చెందాడు. అతడికి కుమారులు లేకపోవడంతో కూతురే తలకొరివి పెట్టింది. శ్రీనివాస్ పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో కాలనీవాసులు చందాలు వేసుకొని దహన సంస్కారం నిర్వహించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తూప్రాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రజని(20) రెండు నెలల క్రితం ఒక పాపకు జన్మనిచ్చింది. అయితే ఆ పాప కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి రజని మనస్తాపంతో అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమెను గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. ఈ క్రమంలో ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేత చింతల

నర్సాపూర్: నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి చింతల కరుణాకర్‌రెడ్డి శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో ఆ పార్టీ నాయకులు శేషసాయి రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం నియోజకవర్గానికి వచ్చాక పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి పార్టీలో చేరిన కరుణాకర్‌రెడ్డికి శాలువా కప్పి ఆహ్వానించారు.